

జై బోలో హనుమాన్ కీ..

- మార్మోగిన రామనామం
- పట్టణాల్లో రమణీయంగా సాగిన శోభాయాత్ర
- వాడవాడలా ఘనంగా హనుమాన్ జయంతి

సిద్దిపేట క్రైం/గజ్వేల్, ఏప్రిల్ 23 : జిల్లాలో రామనామం మార్మోగింది. వీధులన్నీ కాషాయమయ్యాయి. జై శ్రీరాం.. నినాదాలు హోరెత్తాయి. వాడవాడలా హనుమాన్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. సిద్దిపేట పట్టణంలో విశ్వహిందూ పరిషత్ బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు రంగధాంపల్లి హనుమాన్ టెంపుల్ నుంచి బయలుదేరిన హనుమాన్ శోభాయాత్ర బాబు జగ్జీవన్‌రాం చౌరస్తా నుంచి పాత బస్టాండ్ మీదుగా నర్సాపూర్ చౌరస్తా, లాల్ కమాన్, విక్టరీ టాకీస్ చౌరస్తా, గద్ద బొమ్మ నుంచి రూరల్ పోలీస్ స్టేషన్ చౌరస్తా వరకు కొనసాగింది. శోభాయాత్రలో విశ్వహిందు పరిషత్, బజరంగ్‌దళ్ కార్యకర్తలు హనుమాన్ భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఆటపాటలు, నృత్యాలతో ర్యాలీ ఉత్సాహంగా సాగింది. ర్యాలీ అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అలాగే గజ్వేల్ పట్టణంలోని శ్రీ సీతారామ, ఉమామహేశ్వర దేవాలయం నుంచి మార్కెట్ రోడ్డు, ఢిల్లీ వాలా హోటల్, ఇందిరాపార్కు చౌరస్తా మీదుగా సంగాపూర్ రోడ్డులోని సంతోషిమాత ఆలయం వరకు ఈ శోభాయాత్రను నిర్వహించారు. ఈ శోభాయాత్రలో మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, ఎమ్మెల్సీ వంటేరి యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, ఆలయకమిటీ బృందం, పూజారులు పాల్గొన్నారు. శోభాయాత్రకు హాజరైన భక్తులకు వాసవీ సేవా క్లబ్, అభయహస్తం బృందం, కూరగాయల మార్కెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిమ్మరసం, మజ్జిగ, నీటిని అందజేశారు. అనంతరం గజ్వేల్ పట్టణంలోని సంతోషిమాత దేవాలయం వద్ద మునిసిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శోభాయాత్రలో రాముడి, హనుమంతుని భారీ విగ్రహాల వద్ద ఆయా వేషధారణతో కలకత్తాకు చెందిన కళాకారులు చేసిన నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్లో ఆలయ కమిటీ సభ్యులు, హైందవ కమిటీ, సామాజిక సమరసతా వేదిక, భజరంగ్‌దళ్ సభ్యులు, ఆయా పార్టీలకు చెందిన నాయకులు, ప్రజలు, హనుమాన్ భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



గజ్వేల్‌లో నిర్వహించిన శోభాయాత్రలో వీరహనుమాన్ విగ్రహం వద్ద మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



సిద్ది పేటలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



గజ్వేల్‌లో..



కుకునూరుపల్లిలో ఏర్పాటు చేసిన 27 అడుగుల పంచముఖ హనుమాన్ విగ్రహం



నామినేషన్ల జోరు

- మెదక్ పార్లమెంట్ స్థానానికి 10 నామినేషన్లు
- జహీరాబాద్‌లో మూడు..
- రేపటితో ముగియనున్న గడువు

మెదక్ అర్బన్/సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 23: లోక్‌సభ ఎన్నికలకు నామినేషన్ల గడువు రేపటితో ముగియనుండడంతో దాఖలు ప్రక్రియ జోరందుకుంది. ఇప్పటి వరకు ప్రధాన పార్టీల నుంచి ఒకరిద్దరే నామినేషన్లు వేయగా స్వతంత్ర అభ్యర్థులు ఎక్కువ మంది నామినేషన్లు వేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని మెదక్, జహీరాబాద్ నియోజకవర్గాలకు మంగళవారం 13 మంది నామినేషన్లు వేశారు. మెదక్ లోక్‌సభ స్థానానికి 10 నామినేషన్లు దాఖలయ్యాయి. బంగారయ్య(ఇండియా ఫార్వర్డ్ బ్లాక్), మాధవనేని రఘునందన్‌రావు(బీజేపీ), తుపాకుల మురళీకాంత్ (తెలంగాణ రాజ్య సమితి), సారా యాదగిరి(ప్రజా వెలుగు పార్టీ), సత్యనారాయణగౌడ్(స్వతంత్ర), షైసన్గారి సునీల్(ఇండియా ప్రజాబంధు పార్టీ), కొల్కూరి ప్రతాప్(స్వతంత్ర), దొడ్ల వెంకటేశం(తెలంగాణ ప్రజాశక్తి పార్టీ), చిక్కుపల్లి నవీన్‌కుమార్(స్వతంత్ర), మాడి శ్రీనివాస్‌రెడ్డి(స్వతంత్ర) అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు.

జహీరాబాద్ స్థానానికి..

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఆరవ రోజైన మంగళవారం నాడు మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి క్రాంతి వల్లూరుకు నామినేషన్ పత్రాలను అందజేశారు. బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ తరఫున ఆ పార్టీ నాయకులు ఒక సెట్ నామినేషన్ పత్రాలను దాఖలు చేయగా, ఇండియా ప్రజాబంధు పార్టీ తరఫున బాబు దుర్గయ్య, అలయెన్స్ ఆఫ్ డిమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ తరఫున చావగాని మణి నామినేషన్ దాఖలు చేశారు.

వేసవిలో ప్లాన్ చేయండిలా

- నేటి నుంచి విద్యార్థులకు సెలవులు
- ఈ రెండు నెలలు పిల్లలు జాగ్రత్త
- నైపుణ్యాలను పెంపొందించుకోవాలని నిపుణుల సూచన

7లో



ధాన్యం... దైన్యం

ఆరుగాలం శ్రమించినా అన్నదాతలకు ఆపసోపాలు తప్పడం లేదు. నారు వేసిన నాటి నుంచి ధాన్యాన్ని మిల్లుల్లోకి తరలించే దాకా అనేక ఆటంకాలు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు అకాల వర్షాల బీభత్సం సరేసరి. రాత్రింబవళ్లు పంట దిగుబడికి చెమట చిందించడం ఒకెత్తయితే.. ఆ పంటను విక్రయించడానికి రోజుల కొద్దీ పడిగాపులు పడడం మరో ఎత్తవుతున్నది. అధికార యంత్రాంగం లోపంతో సిద్దిపేట జిల్లావ్యాప్తంగా రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు.

- కొనుగోలు కేంద్రాల్లో సమస్యల తిష్ట
- కుప్పల వద్దే రైతుల పడిగాపులు
- అకాలవర్షాలతో అన్నదాతలకు అష్టకష్టాలు
- జిల్లాలో 418 కొనుగోలు కేంద్రాల ఏర్పాటు
- అంచనా కొండంత.. కొన్నది గోరంత
- రైస్‌మిల్లుల్లో విక్రయించేందుకు ఆసక్తి

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఏప్రిల్ 23: జిల్లా వ్యాప్తంగా 418 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ధాన్యం సేకరిస్తున్నారు. ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా ఆధ్వర్యంలో ఈ కేంద్రాలను కొనసాగిస్తున్నారు. అయితే, మరోనెల రోజులు గడిచినా ధాన్యం సేకరణ లక్ష్యం నెరవేరేట్లు కనిపించడం లేదు.

కేంద్రాల్లో పడిగాపులు

యాసంగిలో జిల్లాలో సుమారు 3.38లక్షల ఎకరాల్లో వరిసాగు చేశారు. దాదాపు 6లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. కానీ పంట చేతికొచ్చే సమయంలోనే వారం పాటు అకాల వర్షాలు, వడగండ్లు వరిని అతలాకుతలం చేశాయి. దాదాపు లక్ష ఎకరాల్లో పంట దెబ్బ తిన్నది. దీంతో 3 నుంచి 4లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించే అవకాశం ఉంటుందని అంచనా వేశారు. 418 కేంద్రాలను ఏర్పాటు చేశారు. కానీ ముందస్తు ప్రణాళిక లేకపోవడంతో కేంద్రాల్లో సమస్యలు తిష్టవేశాయి. తరుగు, తాలు నిబంధనల పేరిట నిర్వాహకులు రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. చాలా కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు లేవు. ఇంచు మించు రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అనుకున్నా.. సోమవారం వరకు కేవలం 15వేల టన్నులే సేకరించడం గమనార్హం. తేమ, ఒక్కో రైతు 20 రోజుల నుంచి కేంద్రాల్లోనే పడిగాపులు పడుతున్నారంటే అతిశయోక్తి కాదు.



దుబ్బాక మండలం చెల్లాపూర్‌లోని కొనుగోలు కేంద్రంలో అద్దెకు తెచ్చిన తాలు యంత్రంతో రైతు అవస్థలు

అకాల వర్షాలతో ముప్పు

ఇప్పటికే అకాల వర్షాలతో చేనులో ఉన్న వరిపంట దెబ్బతిన్నది. ఆ తర్వాత కేంద్రాలకు తెచ్చిన ధాన్యం రాశులు తడిసిముద్దవుతున్నాయి. ఓ వైపు ఎండలు మండుతున్నప్పటికీ మరోవైపు అకాల వర్షాలు వణుకుపుట్టిస్తున్నాయి. దాదాపు 70 శాతం పంట కోయడంతోపాటు ధాన్యాన్ని కేంద్రాలకు తరలించారు. కేంద్రాల్లో సరిపడా స్థలం లేకపోవడంతో రహదారులపై ఆరబెడుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇదంతా సేకరించాలంటే మరో నెలరోజులు పట్టే పరిస్థితులు నెలకొన్నాయి. అప్పుడు కూడా పూర్తికాకుంటే వానలు మొదలైతే కేంద్రాల్లో ఉన్న ధాన్యానికి ముప్పు తప్పదు. అందుకే వెనువెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేస్తేనే అన్ని సమస్యలు పరిష్కారమవుతాయి. లేదంటే భారీ మూల్యాన్ని చెల్లించక తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



సిద్ది పేట వ్యవసాయ మార్కెట్‌యార్డులో ఆరబెట్టిన ధాన్యం



కొండపాక మండలం బందారంలో కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో పేరుకుపోయిన ధాన్యం

కేంద్రాల కన్నా.. మిల్లులు మిన్న

కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన ధాన్యానికి ప్రభుత్వం మద్దతు ధర ఇస్తున్నది. ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2203, బి గ్రేడ్ ధాన్యానికి రూ.2183 అందజేస్తున్నారు. ధాన్యం సేకరించిన వారం రోజుల్లోపే ఈ నగదును రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నారు. అయితే ధాన్యాన్ని కొనుగోలు చేయడమే అసలు సమస్యగా మారింది. దీనికితోడు అకాల వర్షాలకు ఎండిన ధాన్యం మళ్లీ తడిసిముద్దవుతోంది. ఈ ఇబ్బందుల కంటే నేరుగా పొలం నుండి రైస్‌మిల్లులకు ధాన్యాన్ని తరలించి విక్రయించడమే సులువైన మార్గంగా రైతులు భావిస్తున్నారు. అయితే ప్రైవేటు వ్యాపారులు క్వింటాల్‌కు రూ.1800 నుంచి రూ.1850 వరకు ఇస్తున్నారు. క్వింటాల్‌కు రూ.300 నుంచి రూ.400వరకు నష్టం వాటిల్లుతున్నా మిల్లుల వైపే మొగ్గు చూపిస్తున్నారు.



బెజ్జంకి మండలం గుగ్గిళ్లలోని రైస్‌మిల్లులో ధాన్యాన్ని విక్రయించేందుకు బారులు తీరిన ట్రాక్టర్లు

త్వరగా కొనుగోలు చేయాలి : అదనపు కలెక్టర్

దుబ్బాక : కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యాన్ని రైతుల నుంచి త్వరితగతిన కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మంగళవారం దుబ్బాకలోని వ్యవసాయ మార్కెట్ కమిటీలో ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. రైతులతో ఎవరైనా నిర్లక్ష్యం గా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు దళారులను నమ్మిమోసపోవద్దని సూచించారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది తదితరులున్నారు.

ధాన్యంలో కోత విధిస్తున్నారు



కొండె తిరుపతిరెడ్డి, రైతు, చెల్లాపూర్

కొనుగోలు కేంద్రాల్లో సరైన సౌకర్యాలు లేవు. టార్పాలిన్ కవర్లు ఇవ్వడం లేదు. ఎప్పుడు వర్షం కురుస్తుందోనని భయంతో బిక్కుబిక్కుమంటున్నాం. వర్షానికి తడిసిన ధాన్యం కొనడం లేదు. తేమ, తాలు సాకులు చెప్పి ఐదు నుంచి ఆరు కిలోల కోత విధిస్తున్నారు. తాలు మిషన్లకు గంటకు రూ.వెయ్యి వరకు కిరాయి వసూలు చేస్తున్నారు.

పదిరోజులుగా ఇక్కడే ఉన్న



- బీర్ల నర్సయ్య, రైతు, చేర్యాల

పది రోజుల క్రితం చేర్యాల మార్కెట్‌కు ధాన్యం తీసుకువచ్చాను. రెండుసార్లు అకాల వర్షం పడడంతో వడ్లు తడిసిపోయాయి. తేమ వచ్చేసరికి మళ్లీ ఆరబెట్టమన్నారు. ఇప్పటికే పదిరోజులు గడిచింది. మరోసారి వర్షం పడితే ఇక్కడే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

వర్షమొస్తే ఆగమైతాం



- కిషన్, రైతు, కోదండరావుపల్లి

కొనుగోలు కేంద్రానికి ధాన్యాన్ని తెచ్చి 20 రోజులవుతున్నది. ఇప్పటిదాకా వచ్చిన వర్షాలకు మా ధాన్యాన్ని కాపాడుకున్నాం. ఇంకా తూకం వేయడం ప్రారంభించలేదు. అధికారులు కూడా ధాన్యం గురించి స్పందించాలి. మళ్లీ వర్షం పడిందంటే ఆగమైతాము.

కేంద్రంలో సమస్యలు



- గందమాల ప్రభాకర్, రైతు, లక్కపల్లి

మద్దూరు ఐకేపీ కేంద్రానికి 10 రోజుల కింద వడ్లు తీసుకొచ్చాను. సెంటర్లో మంచినీళ్ల సౌకర్యం లేదు. రైతులే పరదాలు తెచ్చుకునే పరిస్థితి ఉంది. వర్షం వచ్చినా అత్యవసరంగా టార్పాలిన్ కవర్లు లేవు. కనీసం నీడ కోసం టెంటు కూడా ఏర్పాటు చేయలేదు. తేమ ఉంటే కిలో అదనంగా తూకమేస్తున్నారు.

అన్నలు కట్టిన అక్షర కోవెల

- ఆరు నెలలపాటు బయటకు పొక్కకుండా నిర్మాణం
- తేరుకుని ఎదురుగా మరో భవనాన్ని నిర్మించిన ప్రభుత్వం
- నక్సల్స్ శ్రమదానంతో దుంపలపల్లిలో పాఠశాల భవనం



దుంపలపల్లిలో నక్సలైట్లు నిర్మించిన పాఠశాల

దుబ్బాక, ఏప్రిల్ 23: నిర్బంధాలను ఎదుర్కొని, నిఘానేత్రాలను తప్పించుకుని ఆరునెలల పాటు శ్రమించి నక్సలైట్లు పాఠశాలను నిర్మించారు. ఆ తర్వాత తేరుకున్న ప్రభుత్వం నక్సలైట్లు నిర్మించిన పాఠశాలకు దీటుగా మరో భవనాన్ని నిర్మించింది. కానీ ఆ భవనం శ్మశానవాటికకు పక్కనే ఉండడం, దెయ్యాలు తిరుగుతున్నాయని ప్రచారం జరగడంతో నక్సలైట్లు నిర్మించిన భవనమే నేటికీ పాఠశాలగా కొనసాగుతున్నది. ప్రభుత్వం నిర్మించిన భవనం గ్రంథాలయంగా మారింది. అయితే గ్రామంలో ఈ రెండు భవనాలు రెండు చైతన్య దీపికలుగా నిలిచాయి. దుబ్బాక మున్సిపల్ పరిధిలోని 4, 5వార్డుల్లోని భవనాలకున్న చరిత్ర ఇది.

1996 ప్రాంతంలో దుంపలపల్లిలో కనీస వసతులు లేక చింతచెట్లకింద విద్యార్థుల చదువులు కొనసాగేవి. అప్పుడే నక్సలైట్లు శ్రమదానం చేయాలని తీర్మానం చేసుకుని, పలు గ్రామాలను దత్తత తీసుకున్నారు. అందులో భాగంగా 1996లోనే పీపుల్స్‌వార్ పార్టీ తరఫున దుంపలపల్లిలో విద్యాలయం నిర్మించాలని భావించారు. పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న ఆ గ్రామాన్ని ఎంచుకున్నారు. ఆ సమయంలో పీపుల్స్‌వార్ పార్టీపై ప్రభుత్వ నిషేధం, పోలీసుల నిర్బంధం కొనసాగుతున్నది. అయినా కూడా గ్రామస్థులతో చర్చించిన నక్సల్స్ విద్యాలయానికి పునాదులు వేశారు. ఏకంగా ఆరు నెలల పాటు ప్రాణాలను పణంగా పెట్టి, పోలీసులకు సమాచారం పొక్కకుండా ఆరు గదులను నిర్మించారు. వారే మేస్త్రీలుగా, వారే కూలీలుగా మారి గ్రామస్థుల సహకారంతో భవనాల నిర్మాణం పూర్తి చేశారు. భవనాలు పూర్తయి విద్యార్థులను అందులోకి చేర్చిన నెలరోజుల వరకు కూడా పోలీసులకు విషయం తెలియదంటే ఆ గ్రామస్థుల నిబద్ధత ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. ఆ తర్వాత పోలీసులు పాఠశాలను కూల్చేందుకు ప్రయత్నించగా గ్రామస్థులు అడ్డుకున్నారు. అప్పటి సిద్దిపేట ఎమ్మెల్యే చంద్రశేఖర్‌రావు జోక్యంతో కూల్చకుండా నివారించారు. దీంతో నక్సలైట్లకు సహకరించారంటూ గ్రామానికి చెందిన 16మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. ఐదేళ్ల పాటు గ్రామస్థులు కోర్టు చుట్టూ తిరగక తప్పలేదు.

గ్రంథాలయంగా ప్రభుత్వ భవనం

గ్రామంలో నక్సల్ పాఠశాల భవనం నిర్మించిన విషయం తెలుసుకుని ప్రభుత్వం మరో ప్రాథమిక పాఠశాల భవనం నిర్మించాలని భావించింది. నక్సలైట్లు కట్టిన పాఠశాలకు ఎదురుగా మరో పాఠశాల భవనానికి శ్రీకారం చుట్టారు. 2005లో సుమారు రూ.18లక్షలతో రెండు భవనాలను నిర్మించారు. అయితే అధికారులు ఎంపిక చేసిన ఆ స్థలం పక్కనే శ్మశానవాటిక ఉండడంతో విద్యార్థులు ఆ పాఠశాల భవనంలోకి వెళ్లడానికి భయపడ్డారు. దెయ్యాలు తిరుగుతున్నాయనే ప్రచారం జరుగడంతో ఆ పాఠశాల భవనం నిరుపయోగంగా మారింది. ఆ తర్వాత గ్రామస్థులు గ్రంథాలయంగా మార్చారు. ప్రస్తుతం అందులో గ్రంథాలయంతో పాటు పాలకేంద్రం కూడా కొనసాగుతున్నది. నక్సలైట్లు నిర్మించిన భవనంలోనే పాఠశాల కొనసాగుతున్నది.



గ్రంథాలయ భవనం

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో

ఉద్యోగిగా ట్రాన్స్‌జెండర్ నియామకం



ట్రాన్స్‌జెండర్ ప్రశాంతికి నియామక పత్రాన్ని అందజేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ టి.రఘురాం

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 23: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యాలయంలో ట్రాన్స్‌జెండర్ ప్రశాంతి ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా నియమితులయ్యారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో మొదటి నియామక పత్రాన్ని ఆ సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి టి.రఘురాం, కార్యదర్శి స్వాతిరెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి రఘురాం మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పు మేరకు సమాన గౌరవం, సమానం గౌరవం దక్కాలన్న సూచన మేరకు ఈ నియామకం చేశామని తెలిపారు. భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను ట్రాన్స్ జెండర్స్ సద్వినియోగం చేసుకుని, అన్ని రంగాల్లో రాణించాలని కోరారు.

కొమురవెల్లి ఆలయ వార్షిక ఆదాయ, వ్యయ వివరాల వెల్లడి
- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్
8లో

మేనల్లుడిని కాదని వేరే పెళ్లి చేసుకున్న కూతురు
- మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య
7లో







ఆలిండియా సైనిక్ స్కూల్‌లో యశ్వంత్‌కు సీటు

● అభినందించిన పాఠశాల యాజమాన్యం



యశ్వంత్‌ను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 23: ఆలిండియా సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో సీటు సాధించిన సంగారెడ్డిలోని శాంతినగర్ సెయింట్ ఆంథోనీస్ విద్యార్థి యశ్వంత్‌ను పాఠశాల యాజమాన్యం మంగళవారం అభినందించింది. ఈ ఏడాది జనవరి 28న నిర్వహించిన ఆలిండియా సైనిక్ స్కూల్ ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో పాఠశాలలో ఐదో తరగతి విద్యనభ్యసిస్తున్న యశ్వంత్ 300 మార్కులకుగాను, 245 మార్కులు సాధించి వెస్ట్ బెంగాల్‌లోని పురూలియా స్కూల్ సీటు సాధించి ఆరో తరగతికి ఎంపికయ్యాడు. యశ్వంత్‌ను పాఠశాల డైరెక్టర్ సోలోమోన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ అరుణారెడ్డి, అడ్మినిస్ట్రేషన్ హెడ్ జయబాలరెడ్డి, అకాడమిక్ డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.



ఓటు హక్కును వినియోగించుకోవాలి

● స్వీప్ నోడల్ అధికారి సంజీవరావు



ఓటరు చైతన్య ర్యాలీని నిర్వహిస్తున్న దివ్యాంగులు

జహీరాబాద్, ఏప్రిల్ 23: అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని స్వీప్ నోడల్ అధికారి సంజీవరావు పేర్కొన్నారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలో దివ్యాంగుల, ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో పట్టణంలో రహదారిపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ వృద్ధులు, వికలాంగులు, వయస్సు పైబడిన వారందరు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేశామని తెలిపారు. కొత్తగా ఓటరు నమోదు, తొలగింపులు, మార్పులు, చేర్పులు తదితర వివరాలకు సంబంధిత బీఎల్‌వోలు, తహసీల్దార్ కార్యాలయాల్లో అధికారులను సంప్రదించాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో సునిత, సూపర్‌వైజర్లు, దివ్యాంగులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో అమర్‌నాథ్ యాత్రికులకు 'ఫిట్‌నెస్'



సంగారెడ్డి జీజీహెచ్‌లో ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీచేస్తున్న డాక్టర్ శ్యామ్‌సుందర్

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 23: అమర్‌నాథ్ యాత్రకు వెళ్లేవారికి సంగారెడ్డిలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేస్తున్నారు. జనరల్ ఫిజీషియన్ డా.శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే భక్తులను ప్రత్యక్షంగా పరిశీలించి, మెడికల్ టెస్టులు నిర్వహించి ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌కు జారీ చేస్తున్నారు. ఇప్పటి వరకు 22 మందికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేసినట్లు ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.జి.అనిల్‌కుమార్ తెలిపారు. అన్ని పని దినాల్లో ఉదయం 9 నుంచి 12 గంటల వరకు ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. అమర్‌నాథ్ యాత్రకు వెళ్లే యాత్రికులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం ఆస్పత్రిలోని ఆర్ఎంవో గదిలో సంప్రదించాలని సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్ స్పష్టం చేశారు.

'ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు'

కంది, ఏప్రిల్ 23: ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు పొందొచ్చని ఉద్యానవన శాఖ అధికారి శైలజ తెలిపారు. కంది మండల పరిధిలోని చిద్రుప్ప గ్రామంలో మంగళవారం ఆమె ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శైలజ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు చేయాలనునే రైతులు ఒక ఎకరాకు 57 మొక్కలు పెట్టాలని, ఆ మొక్కలకు వేసే డ్రిప్ ఇరిగేషన్‌పై ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని తెలిపారు. ఎలాంటి వాతావరణంలోనైనా ఈ ఆయిల్‌పామ్ మొక్కలు ఎదుగుతాయన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలను గడించవచ్చని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి అశోక్‌కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి స్వాతి, రైతులు, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.


















పిల్లలను ఇంటికి తీసుకెళ్తున్న తండ్రి, సెలవులు ప్రకటించడంతో బాయ్‌బాయ్ చెబుతున్న మెదక్ మండలం చిట్యాల పాఠశాల విద్యార్థులు

వేసవిలో ప్లాన్ చేయండిలా

● నేటి నుంచి విద్యార్థులకు సెలవులు ● ఈ రెండు నెలలు పిల్లలు జాగ్రత్త ● నైపుణ్యాలను పెంపొందించుకోవాలని నిపుణుల సూచన

కొండపాక/మెదక్ కల్చరల్, ఏప్రిల్ 23: విద్యా సంవత్సరం ముగిసింది. నేటి నుంచి పాఠశాల విద్యార్థులకు వేసవి సెలవులు వచ్చాయి. సుమారు 49 రోజులు సెలవుల్లో విద్యార్థులు చేయాల్సినవి, చేయకూడని పనులను విద్యాభిమానులు, విద్యాశాఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు విద్యార్థుల తల్లిదండ్రులకు సూచనలు ఇస్తున్నారు. సెలవు అంటే ఎంజాయ్ చేయడం కాదని, తెలియని విషయాలను నేర్చుకోవడం కోసం సెలవులను ఒక అవకాశంగా భావించి సద్వినియోగం చేసుకోవాలని సూచిస్తున్నారు.

చేయాల్సినవి

- విద్యార్థులు ఉదయం త్వరగా మేల్కోవాలి. రోజువారీ దినచర్యను రూపొందించుకోవాలి.
- యోగా, ధ్యానం లేదా వాకింగ్ చేయాలి.
- పెయింటింగ్, డ్యాన్స్ సంగీతం లేదా పబ్లిక్ స్పీకింగ్ వంటి కొత్త నైపుణ్యాలను నేర్చుకోవడం ప్రారంభించాలి.
- ఆటలు, క్రీడలు, శారీరక శ్రమ చేయాలి. అది కూడా ఉదయం, సాయంత్రం వేళల్లో చేయాలి.
- పుస్తకాలు చదవాలి. గ్రామంలో ఉన్న గ్రంథాలయాన్ని రోజూ సందర్శించి తమకు ఇష్టమున్న పుస్తకాలను చదవాలి. సెలవుల్లో కనీసం నాలుగైదు మంచి పుస్తకాలను చదవడం పూర్తి చేయాలి.
- రోజు ఒక గంటసేపు రైటింగ్ ప్రాక్టీసు(తెలుగు/ ఇంగ్లిష్/ హిందీ) చేయాలి.
- దగ్గరి బంధువుల ఇంటికి/గ్రామాలకు/పట్టణాలకు వెళ్లి కొద్దిరోజులు గడపాలి. బంధువులతో వరుసలు కలుపుతూ సంబోధించాలి.
- కుటుంబ పనుల్లో తల్లిదండ్రులకు సహాయం చేయాలి. అలాగే వారి నుంచి కొన్ని పని నైపుణ్యాలను నేర్చుకోవాలి.
- గ్రామాల్లో జాతర లాంటి సామూహిక కార్యక్రమాలు జరిగితే వాలంటీర్‌గా పనిచేసి నిర్వహణ కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలి.
- ఇంటి చుట్టుపక్కల ఉన్న వృద్ధులకు, దివ్యాంగులకు వారి రోజువారీ పనుల్లో సహాయపడాలి.
- అమ్మమ్మ, నానమ్మ, తాతయ్యలు ఉంటే వారితో ఎక్కువ సమయం గడపాలి. అలాగే గ్రామంలో ఉన్న పెద్దవారితో, వృద్ధులతో కలుపుగోలుగా మాట్లాడుతూ వారు చెప్పే మంచి విషయాలు, కథలు, వారి జీవిత అనుభవాలు శ్రద్ధగా వినాలి. గ్రామ చరిత్ర, పూర్వీకుల గురించి అడిగి తెలుసుకోవాలి.
- ధూమపానం, మద్యపానం, డ్రగ్స్ లాంటి వాటికి, వాటిని ఉపయోగిస్తున్న వారికి చాలా దూరంగా ఉండాలి. అవి మనల్ని ఆర్థికంగా, ఆరోగ్యంగా, సామాజికంగా సర్వనాశనం చేస్తాయి.
- ఆసక్తి ఉంటే గ్రామంలో ఉన్న ఆలయం/మసీదు/చర్చిలను తరచూ సందర్శించాలి.అక్కడి సంప్రదాయాలు, విధానాలు గమనించాలి.
- పెద్దవాళ్ల సహాయంతో సైకిల్ తొక్కడం, ఈత కొట్టడం వంటివి చేయడం, ఇంటి పనులు చేయడం నేర్చుకోవాలి.
- స్కూల్లో ఇచ్చిన సెలవుల హోమ్‌వర్క్ పూర్తిచేయాలి. చివరిరోజు వరకు వాయిదా వేయకూడదు.
- మజ్జిగ, నిమ్మరసం, మంచినీరు బాగా తాగాలి.
- రాత్రి 10 గంటలలోగా తప్పనిసరిగా నిద్రపోవాలి.
- మొక్కలకు నీళ్లు పోయడం, వంట పనిలో, ఇల్లు శుభ్రం చేసుకోవడంలో సహాయం చేయడం.

చేయకూడనివి

- ఉదయం లేట్‌గా నిద్ర లేవకూడదు.
- వీడియో గేమ్‌లు/మొబైల్ గేమ్‌లను ఆడి సమయాన్ని వృథా చేసుకోవద్దు.
- మొబైల్ ఫోన్లను అతిగా వాడకూడదు. సోషల్ మీడియాకు బానిస కాకూడదు.
- సూర్యరశ్మి ఎక్కువగా ఉండే సమయాల్లో బయటకు వెళ్లొద్దు. ఆసక్తికరమైన ఇండోర్ గేమ్స్ ఆడాలి.
- అతిగా నిద్రపోకూడదు. సోమరితనంగా ఉండకూడదు. సెలవుల్లో చురుకుగా ఉండాలి.
- తల్లిదండ్రులకు/పెద్దవాళ్లకు చెప్పకుండా ఎక్కడికి వెళ్లకూడదు.
- చెడు వ్యసనాలు ఉన్నవారితో స్నేహం చేయకూడదు. వారితో తిరగకూడదు.
- ఇతరులతో/చుట్టుపక్కల వారితో కొట్లాటలు, గొడవలు పెట్టుకోకూడదు. వారితో సామరస్యంగా ఉండాలి. గొడవలు జరిగే దగ్గరికి వెళ్లకూడదు.
- టీవీలు, ఫోన్లు అర్ధరాత్రి వరకు చూడొద్దు.
- వేసవి సెలవులను చదువుకు విరామంగా భావించకూడదని, సెలవులు అంటే అసలైన సారాంశమని, సరదాగా, ఆనందంగా మంచి నైపుణ్యాలను నేర్చుకునే సమయమని భావించాలి.
- తల్లితండ్రులు వారి పిల్లలతో తప్పనిసరిగా మాట్లాడాలి. వారి రోజు ఎలా గడిచిందో తెలుసుకోవాలి. సంతోషం, బాధ, కోపం కలిగించిన సంఘటనలు, ఇత విషయాల గురించి సంభాషణ చేయాలి.
- రోజువారీ కార్యక్రమాలలో పిల్లలను భాగస్వాములను చేయాలి.

చదువులకు విశ్రాంతినివ్వండి



వేసవి సెలవులు అంటే పిల్లల్లో ఉన్న మానసిక ఒత్తిడిని తగ్గించడమే. సెలవుల్లో సైతం కోచింగ్, సమ్మర్ క్యాంప్ అంటూ ఒత్తిడి పెంచకూడదు. విహారయాత్రకు తీసుకెళ్లాలి. దీనివల్ల ఆయా ప్రాంతాల పట్ల వారిలో అవగాహన కలుగుతుంది. వేసవి సెలవుల్లో ప్రైవేట్ కానీ, ప్రభుత్వ పాఠశాలలు కానీ, కోచింగ్ సెంటర్లు పెట్టకుండా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలి.

- రవీందర్, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, లక్ష్మణ్‌తండా పాఠశాల, టేక్మాల్

ఎండల్లో అప్రమత్తత అవసరం



వేసవి సెలవుల నేపథ్యంలో పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాలి. పాఠశాలలకు సెలవులు రావడంతో ఎండలను లెక్క చేయకుండా ఆడుతుంటారు. దీంతో ఎండ దెబ్బ తగిలి డీహైడ్రేషన్‌కు గురై అనారోగ్యం పాలవుతారు. చల్లటి పానీయాలు, నాసిరకం ఐస్‌క్రీములు, జ్యూస్ తాగడం వల్ల గొంతు ఇన్‌ఫెక్షన్ వచ్చే అవకాశాలు ఉంటాయి. ఎలాంటి ఆరోగ్య సమస్యలున్నా వైద్యులను సంప్రదించాలి.

- తిరుమలేష్, ప్రభుత్వ చిన్న పిల్లల వైద్యుడు, మెదక్

సెలవులు కారాదు విషాదం



పిల్లలకు ద్విచక్ర వాహనాలు, కార్లపై అమితాసక్తి ఉంటుంది. దీంతో ఇంట్లో వాళ్లకు చెప్పకుండా వాటిని నడిపేందుకు రోడ్డెక్కి ప్రమాదాల బారినపడుతుంటారు. కాబట్టి వీలైనంతవరకు పిల్లలకు వాహనాలు ఇవ్వకూడదు. ఒకవేళ నేర్పించాలనుకుంటే పెద్దల సమక్షంలో సరైన శిక్షణ ఇవ్వాలి. ప్రమాదాల బారినపడకుండా చూసుకోవాలి.

- దిలీప్‌కుమార్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్, మెదక్

10 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



రేషన్ బియ్యాన్ని పట్టుకున్న టాస్క్‌ఫోర్స్, టూ టౌన్ పోలీసులు

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 23: సిద్దిపేటలోని కరీంనగర్ రోడ్డు మార్కెట్ వద్ద ఉన్న కొర్తివాడ శ్రీనివాస్ షాపులో 10 క్వింటాళ్ల బియ్యాన్ని టాస్క్‌ఫోర్స్, సిద్దిపేట టూ టౌన్ పోలీసులు పట్టుకున్నారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ పోలీసులు మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడైనా ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక, రేషన్ బియ్యం అక్రమ రవాణా చేసినా, నిల్వ ఉంచినా చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వివరాలు తెలిసిన వారు సిద్దిపేట టాస్క్‌ఫోర్స్ అధికారుల 8712667445, 8712667446, 8712667447 నెంబర్లకు సమాచారమందించాలని తెలిపారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

చిన్నారిపై కొండెంగ దాడి



కొండెంగల కోసం వెతుకుతున్న అటవీశాఖ అధికారులు

రామాయంపేట, ఏప్రిల్ 23: చిన్నారిపై కొండెంగ దాడిచేసిన సంఘటన రామాయంపేట మున్సిపల్ పరిధి గొల్పర్తి గ్రామంలో చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన గాయత్రి అనే బాలిక మంగళవారం ఉదయం పాఠశాలకు వెళ్తుండగా దారిలో కొండెంగలు మీదపడి గాయపర్చాయి. దీంతో బాలిక ఆస్పత్రి పాలైంది. ఈ విషయమై కౌన్సిలర్ అటవీశాఖ అధికారులకు ఫిర్యాదు చేయగా.. సిబ్బంది వచ్చి కొండెంగలను పట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు.

అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు: ప్రభాకర్‌రావు



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి ప్రభాకర్‌రావు

సంగారెడ్డి క్రైం, ఏప్రిల్ 23: అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు వస్తుందని జిల్లా ప్రధాన న్యాయాధికారి కె.ప్రభాకర్‌రావు అన్నారు. కాగా ప్రభాకర్‌రావు ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. అలాగే జిల్లా మొదటి అదనపు కోర్టు న్యాయాధికారి సుదర్శన్ రంగారెడ్డి జిల్లా కోర్టుకు బదిలీ అయ్యారు. ప్రభాకర్‌రావు స్థానంలో రంగారెడ్డి జిల్లా రెండో అదనపు మెట్రో పాలిటన్ సెషన్స్ కోర్టు న్యాయాధికారి జి.భవానీచంద్ర సంగారెడ్డికి రానున్నారు. అలాగే సుదర్శన్ స్థానంలో రంగారెడ్డి జిల్లా కోర్టు నుంచి జయంతి సంగారెడ్డికి వస్తున్నారు. న్యాయాధికారులు ప్రభాకర్‌రావు, సుదర్శన్‌లకు జిల్లా కోర్టులో మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రావు మాట్లాడుతూ ఉద్యోగ రీత్యా బదిలీ సహజమని, కానీ విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తేనే గుర్తింపు లభిస్తున్నదన్నారు. అనంతరం ప్రభాకర్‌రావు, సుదర్శన్‌లను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులు సూర్‌రెడ్డి, అంబరీష్, రమేష్, అశోక్, ఆంజనేయులు, లలిత, మాధవి, వీర మహేందర్, నిజామొద్దీన్, జ్ఞానోభా, పెంటయ్య, రమాదేవి, వినోద్‌కుమార్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మల్లన్న ఆలయంలో మైక్‌సెట్ పరికరం విక్రయం?

● డబ్బులు చెల్లించానని సంఘం పెద్దలకు తెలిపిన ఒగ్గు పూజారి
● పట్టించుకోని ఆలయ అధికారులు



మైక్‌సెట్ అనుబంధ పరికరం

చేర్యాల, ఏప్రిల్ 23: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో ఇటీవల భక్తుడు విరాళంగా అందించిన మైక్‌సెట్ పరికరాన్ని ఓ ఉద్యోగి అమ్ముకున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నా ఆలయాధికారులు చోద్యం వహిస్తుండటం వివాదాస్పదమవుతున్నది. కొద్దిరోజుల క్రితం ఓ భక్తుడు సుమారు రూ.10-15 వేలు విలువ గల మైక్‌సెట్ అనుబంధ పరికరం అందించడంతో రికార్డుల్లో పొందుపరిచి, స్టోర్ రూంలో భద్రపరిచారు. ఇటీవల ఎల్లమ్మగుట్టపై మైక్ పనిచేయకపోవడంతో సంబంధిత విభాగం సిబ్బంది మరమ్మతులు నిర్వహించలేదు. దీంతో ఎల్లమ్మ ఆలయం వద్ద పట్నాలు రచించే ఓ ఒగ్గు పూజారి ఆలయ సిబ్బందికి రూ.6,300 చెల్లించి పరికరాన్ని కొనుగోలు చేశానని చెబుతూ ఆలయంలో వినియోగింపజేశాడు. ఈ విషయం ఆ నోటా.. ఈ నోటా బయటకు పొక్కింది. అయితే సదరు ఒగ్గు పూజారి డబ్బులు చెల్లించానని చెబుతున్నాడు. కాగా గత ఆదివారం పలువురు ఒగ్గు పూజారులు ఆలయాధికారులకు తెలిపినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

చేర్యాలలో రూ.62,050 నగదు పట్టివేత



తనిఖీలో నగదును పట్టుకున్న సీఐ శ్రీను

చేర్యాల, ఏప్రిల్ 23: చేర్యాల పట్టణంలోని గాంధీచౌక్ సమీపంలో సీఐ శ్రీను ఆధ్వర్యంలో నిర్వహించిన వాహన తనిఖీలో రూ.62,050 నగదు పట్టుకున్నారు. సిద్దిపేట మండలం ఎల్లుపల్లి గ్రామానికి చెందిన పొద్దుటూరి వెంకటేశ్ వద్ద పట్టుబడిన నగదుకు సంబంధించి ఎలాంటి ఆధార పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసినట్లు సీఐ శ్రీను తెలిపారు. ఆయనవెంట ఎస్‌ఐ దామోదర్ ఉన్నారు.

ఓపెన్ స్కూల్ పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

● రేపటి నుంచి మే 2 వరకు పరీక్షలు
● జిల్లాలో టెన్త్ 10, ఇంటర్ 15 పరీక్షా కేంద్రాలు
● పరీక్షలకు హాజరుకానున్న 6,685 మంది అభ్యాసకులు
● పకడ్బందీ ఏర్పాట్లు చేసిన విద్యాశాఖ

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 23: సంగారెడ్డి జిల్లాలో 2023-24 సంవత్సరానికి సంబంధించి ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ఈ నెల 25 నుంచి మే 2వ తేదీవరకు జరగనున్నాయి. ఇందుకు సంబంధించి విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. టెన్త్ 10 కేంద్రాలు, ఇంటర్మీడియట్ 15 కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నాయి. ఉదయం 9 నుంచి 12 గంటలు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్షల నిర్వహణకు ఆరు స్టోరేజ్ పాయింట్లు, 25 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 25 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 24 మంది జాయింట్ కస్టోడియన్లు, 452 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా టెన్త్ 2,388 మంది, ఇంటర్ 4,297 మంది మొత్తం 6,685 మంది పరీక్షలు రాయనున్నారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్ అధికారులను నియమించనున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉండనున్నది. సందేహాల కోసం కంట్రోల్ రూమ్ 08455-276434, లేదా ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటస్వామి 8008403635 నంబరును సంప్రదించాలని అధికారులు పేర్కొన్నారు.



సంగారెడ్డిలోని ఓపెన్ స్కూల్ పరీక్షా కేంద్రం

రెగ్యులర్ మాదిరిగానే ఓపెన్ పరీక్షలు: డీఈవో

రెగ్యులర్ మాదిరిగానే ఓపెన్ స్కూల్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహిస్తాం. అభ్యర్థులందరూ పరీక్షా సమయం కంటే గంట ముందుగానే కేంద్రాలకు చేరుకోవాలి. ఎలాంటి నిషేధిత మెటీరియల్స్ కేంద్రాల్లోకి అనుమతి లేదు. పరీక్ష ప్రారంభమైన ఐదు నిమిషాల వరకే లోనికి అనుమతిస్తాం. కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా సంబంధిత కేంద్రం బాధ్యులపై శాఖాపరమైన చర్యలు ఉంటాయి. రెగ్యులర్ పరీక్షల తరహాలోనే ఓపెన్ పరీక్షలు సజావుగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలి.

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

● సిద్దిపేట సీపీ డాక్టర్ బి.అనురాధ

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 23: సిద్దిపేట జిల్లాలో రేపటి నుంచి జరిగే తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్) పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలు జరిగే 9 కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని సిద్దిపేట సీపీ డాక్టర్ బి.అనురాధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అమలులో ఉంటుందని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల నుంచి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడ వద్దని, పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేశామని తెలిపారు. విద్యార్థులు పరీక్షా కేంద్రానికి గంట ముందే చేరుకోవాలని, ఆందోళన చెందకుండా పరీక్షలు ప్రశాంతంగా రాయాలని సీపీ సూచించారు.



సీపీ అనురాధ

పదో తరగతి పరీక్షా కేంద్రాలు

1. గవర్నమెంట్ హైస్కూల్, పారుపల్లి, సిద్దిపేట
2. జడ్పీహెచ్‌ఎస్ (గర్ల్స్), గజ్వేల్
3. జడ్పీహెచ్‌ఎస్ (బాయ్స్), చేర్యాల(బి) సెంటర్
4. జడ్పీహెచ్‌ఎస్, హుస్నాబాద్

ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలు

1. గవర్నమెంట్ హైస్కూల్ (బాయ్స్), సిద్దిపేట
2. గవర్నమెంట్ న్యూ స్కూల్, సిద్దిపేట
3. గవర్నమెంట్ హైస్కూల్, గజ్వేల్
4. జడ్పీఎస్‌ఎస్ (బాయ్స్), చేర్యాల (ఏ) సెంటర్
5. జడ్పీహెచ్‌ఎస్(బి), హుస్నాబాద్

కోహీర్‌లో వ్యక్తి దారుణ హత్య

● ఆటో అద్దె అడిగినందుకే దారుణం, పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన నిందితులు



హత్యకు గురైన షేక్ అన్వర్‌అలీ

కోహీర్, ఏప్రిల్ 23: ఆటో అద్దె డబ్బులు అడిగినందుకు ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన కోహీర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద సోమవారం రాత్రి చోటు చేసుకున్నది. కోహీర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... కోహీర్ మండలంలోని రాజనెల్లి గ్రామానికి చెందిన ముస్తకీమ్, గురుజువాడ గ్రామానికి చెందిన మహ్మద్ కైఫ్‌లు హైదరాబాద్‌లోని జగద్గిరిగుట్ట, కుత్బుల్లాపూర్ ప్రాంతానికి చెందిన షేక్ అన్వర్‌అలీ(30) వద్ద ఆటోలను అద్దెకు తీసుకుని నడుపుతుంటారు. అయితే అన్వర్‌అలీకి ఆటో అద్దె డబ్బులు ఇవ్వకుండా హైదరాబాద్ నుంచి తమ స్వగ్రామాలకు వచ్చారు. అద్దె డబ్బులు ఇవ్వాలని అన్వర్‌అలీ తరచూ ఫోన్‌చేస్తూ ఒత్తిడి చేయడంతో ఎలాగైనా హత్య చేయాలని ముస్తకీమ్, మహ్మద్ కైఫ్‌లు భావించారు. సోమవారం మధ్యాహ్నం అన్వర్‌అలీ మళ్లీ డబ్బుల కోసం ఫోన్ చేయగా.. కోహీర్‌కు వస్తే డబ్బులు ఇస్తామని చెప్పారు. దీంతో అన్వర్‌అలీ సోమవారం రాత్రి 12 గంటల ప్రాంతంలో కోహీర్‌కు రాగా.. ప్రభుత్వ జూనియర్ కళాశాల వెనకభాగంలో ముగ్గురూ కలిసి మద్యం సేవించారు. ఈ క్రమంలో డబ్బుల విషయమై గొడవ జరిగింది. దీంతో ముస్తకీమ్, మహ్మద్ కైఫ్‌లు ముందు వేసుకున్న ప్లాన్ ప్రకారం వెంట తెచ్చుకున్న కత్తితో దాడిచేశారు. ఈ దాడిలో మొదట ముస్తకీమ్ ఎదపై కత్తి ఘాటు పడింది. అనంతరం ముస్తకీమ్, మహ్మద్ కైఫ్‌లు ప్రతిఘటించి అదే కత్తితో అన్వర్‌అలీపై దాడిచేయడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. చనిపోయాడని నిర్ధారించుకున్న అనంతరం వారిద్దరూ కోహీర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయారు. మంగళవారం ఉదయం విషయం తెలుసుకున్న జహీరాబాద్ సీఐ రవి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జహీరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇదిలా ఉండగా వీరు ముగ్గురు తరచూ దొంగతనాలు చేసినట్లు పోలీసులు తెలిపారు. హత్యకు గురైన షేక్ అన్వర్‌అలీపైన హైదరాబాద్‌లోని వివిధ పోలీస్‌స్టేషన్లలో 11 దొంగతనాల కేసులు ఉన్నాయని పోలీసులు చెప్పారు.

భార్యను కాపురానికి పంపడం లేదని అత్తను హతమార్చిన అల్లుడు



కంసమ్మ(ఫైల్)

వెల్దుర్తి, ఏప్రిల్ 23: భార్య కాపురానికి రాకపోవడానికి అత్తనే కారణమని కోపంతో అత్తను అల్లుడు గొడ్డలితో దాడిచేసి హతమార్చిన సంఘటన మెదక్ జిల్లా వెల్దుర్తి మండల పరిధిలోని శెట్టిపల్లి గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకున్నది. మంగళవారం ఎస్‌ఐ నవత, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. శెట్టిపల్లి గ్రామానికి సుది కంసమ్మ(65)కు కుమారుడు, ముగ్గురు కూతుళ్లు ఉన్నారు. చిన్న కూతురు శోభను మెదక్ మండలం నవాబ్‌పేటకు చెందిన దశరథకు ఇచ్చి 13 ఏళ్ల క్రితం వివాహం చేశారు. శోభ-దశరథలకు మధ్య తరచూ గొడవలు జరుగుతుండడంతో శోభ భర్తకు దూరంగా తన తమ్ముడు నర్సింహులుతో కలిసి హైదరాబాద్‌లో ఉంటుంది. శోభ కాపురానికి రాకపోవడం, గొడవలు జరగడానికి అత్త కంసమ్మ కారణమని దశరథ కక్ష పెంచుకున్నాడు. సోమవారం రాత్రి శెట్టిపల్లిలోని తమ ఇంట్లో కంసమ్మ, తన చెల్లె బాలమణితో కలిసి నిద్రిస్తున్న సమయంలో దశరథ వెళ్లి కంసమ్మతో గొడవపడ్డాడు. కోపంతో అక్కడే ఉన్న గొడ్డలితో దాడిచేసి హతమార్చాడు. అనంతరం వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. తూప్రాన్ సీఐ క్రిష్ణ, వెల్దుర్తి ఎస్‌ఐ నవత సంఘటనా స్థలాన్ని పరిశీలించి, ఆధారాలను సేకరించారు. మృతురాలి చెల్లె బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వీడిన ఉపాధ్యాయుడి మిస్సింగ్ కేసు

● వివాహేతర సంబంధంతోనే టీచర్ హత్య ● ముగ్గురి అరెస్ట్



నాగరాజు(ఫైల్)

మాసాయిపేట, ఏప్రిల్ 23: మాసాయిపేట మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మోతె నాగరాజు మిస్సింగ్ కేసును చేగుంట పోలీసులు ఛేదించారు. ఉపాధ్యాయుడిని హత్యకు కారకులైన ముగ్గురిని అరెస్ట్ చేశారు. మంగళవారం రాత్రి రామాయంపేట సీఐ బి.వెంకటేశం, చేగుంట సీఐ బాలరాజుతో కలిసి వివరాలను వెల్లడించారు. కామారెడ్డి జిల్లాకు చెందిన మోతె నాగరాజు చేగుంటలో నివాసముంటూ.. మాసాయిపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెండేళ్ల నుంచి హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. గతనెల 24 నుంచి కనిపించకుండాపోయారు. నాగరాజు అద్దెకు ఉంటున్న కింది పోర్షన్‌లో ఓ కుటుంబం నివసిస్తున్నది. తన భార్యతో నాగరాజుకు వివాహేతర సంబంధం ఉన్నదని ఆ కుటుంబంలోని మహిళ భర్త అనుమానించేవాడు. ఈ క్రమంలో మార్చి 28న సాయంత్రం మరో ఇద్దరితో కలిసి నాగరాజు ఉంటున్న పై పోర్షన్‌కు వెళ్లి కొట్టి చంపారు. మరుసటిరోజు మృతదేహాన్ని కారులో తీసుకెళ్లి కేపీహెచ్‌బీ, ప్రగతినగర్ వద్ద గల చెరువులో పడేశారు. మృతుడి కుమారుడు వంశీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న సీఐ బి.వెంకటేశం ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. నిందితులు చెప్పిన వివరాల ఆధారంగా చెరువులో మృతదేహాన్ని కొనుగొన్నారు.

కన్నతల్లిని కడతేర్చిన తనయుడు

● స్నేహితులతో కలిసి ఘాతుకం ● పోలీసుల అదుపులో నిందితులు

దుండిగల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): సతీష్ సొసైటీలో లభ్యమైన గుర్తుతెలియని మహిళ హత్య కేసును దుండిగల్ పోలీసులు ఛేదించారు. మహిళను ఆమె కుమారుడు ఇద్దరు స్నేహితులతో కలిసి హతమార్చాడని తెలిపారు. మెదక్ జిల్లా, ఎర్రకుంటతండాకు చెందిన సక్కుబాయ్(44) భర్త 6 నెలల క్రితం మృతిచెందాడు. ఆమె తన కుమారుడు శేఖర్(22)తో కలిసి గండిమైసమ్మ చౌరస్తా సమీపంలో నివాసముంటూ అడ్డా కూలిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నది. ఈనెల 20న సతీష్ సొసైటీలో ఖాళీ ప్రదేశంలో మహిళ మృతదేహం ఉన్నదని స్థానికులు పోలీసులకు సమాచారమందించారు. దుండిగల్ సీఐ శంకరయ్య సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించి, చనిపోయిన మహిళ సుక్కుబాయిగా గుర్తించారు. అయితే కుమారుడు శేఖర్ తన తల్లి కనిపించడం లేదని ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. 20న సక్కుబాయికి బిర్యానీ తినిపిస్తానని తీసుకెళ్లిన శేఖర్.. మరో ఇద్దరు స్నేహితుల సహకారంతో హత్యచేసి నీటి గుంతలో పడేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులు పోలీసులు అదుపులో ఉన్నట్లు సమాచారం. తండ్రి మృతిచెందినప్పటి నుంచి తల్లి ప్రవర్తన సరిగా లేదని, ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించినా పట్టించుకోకపోవడంతోనే హత్యచేసినట్లు పోలీసుల విచారణలో శేఖర్ చెప్పినట్లు తెలిసింది.

మేనల్లుడిని కాదని వేరే పెళ్లి చేసుకున్న కూతురు

● మనస్తాపంతో తండ్రి ఆత్మహత్య

గజ్వేల్, ఏప్రిల్ 23: అల్లారుముద్దుగా పెంచుకున్న కూతురు తన మేనల్లుడిని కాదని వేరే పెళ్లి చేసుకోవడంతో మనస్తాపానికి గురైన తండ్రి చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలో వెలుగుచూసింది. మెదక్ జిల్లా చేగుంట మండలం పోతాన్‌పల్లి గ్రామానికి చెందిన జీడిపల్లి భాస్కర్‌రెడ్డికి తొగుట మండలం ఎల్లారెడ్డిపేటకు చెందిన పద్మతో 25 ఏళ్ల క్రితం వివాహమైంది. పద్మ తల్లిదండ్రులకు ఒక్కతే కుమార్తె కావడంతో భాస్కర్‌రెడ్డి ఎల్లారెడ్డిపేటకు ఇల్లరికం వెళ్లి, అక్కడే స్థిరపడ్డారు. భాస్కర్‌రెడ్డి-పద్మలకు ఇద్దరు ఆడపిల్లలు. పెద్ద కూతురును మేనల్లుడికి ఇద్దామని కొన్నాళ్లుగా అనుకుంటున్నారు. ఈ క్రమంలోనే కొన్ని రోజుల క్రితం పెద్ద కూతురు ఇంట్లో చెప్పకుండా వెళ్లి తమ కులానికే చెందిన వేరే అబ్బాయిని వివాహం చేసుకున్నది. దీంతో మనస్తాపం చెందిన భాస్కర్‌రెడ్డి సోమవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి, ప్రజ్ఞాపూర్‌లోని ఊరచెరువులో మంగళవారం శవమై తేలాడు. వేకువజామున వాకింగ్ కోసం ప్రజ్ఞాపూర్ ఊర చెరువుపైకి వెళ్లిన వాకర్స్ అక్కడ ఉన్న బండిలో ఫోన్ మోగుతుండడం, అక్కడే చెప్పులు ఉండడం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు భాస్కర్‌రెడ్డి కుటుంబసభ్యులకు సమాచారాన్ని అందించి, మృతదేహాన్ని బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్ సీఐ బి.సైదా తెలిపారు.

చికెన్‌షాపు యజమాని హత్య కేసులో ఇద్దరి అరెస్ట్

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 23: చికెన్‌షాపు యజమాని మహిపాల్‌రెడ్డిని హత్య చేసిన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. షాపులో పనిచేసే కురాబల్, రూబల్ అనే యువకులు ఆదివారం సాయంత్రం పక్కా ప్లాన్‌తోనే హత్యచేసి పరారైనట్లు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం మహిపాల్‌రెడ్డి హత్య వెలుగులోకి రావడంతో గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్‌ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో సీసీ ఫుటేజీల ఆధారంగా గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం రాత్రి విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు యువకులను అక్కడి పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మంగళవారం జగదేవ్‌పూర్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.

గ్రామగ్రామాన ఘనంగా హనుమాన్ జయంతి

అక్కన్నపేట ఏప్రిల్ 23: మండలంలోని మసిరెడ్డితండాలో నూతనంగా నిర్మించిన శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠా ఉత్సవాలకు మంగళవారం సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరై పూజలు చేశారు. అలాగే పెద్ద తండాలో ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ మాలోతు లక్ష్మీబీలునాయక్, మాజీ సర్పంచ్‌లు మాలోతు నానునాయక్, గుగులోతు లక్ష్మీసక్రునాయక్, తదితరులు పాల్గొన్నారు.


అక్కన్నపేట: మసిరెడ్డితండాలో విగ్రహ ప్రతిష్ఠలో పూజలు చేస్తున్న హరీశ్‌రావు

● **చేర్యాల:** హనుమాన్ జయంతి వేడుకలను చేర్యాల, కొమురవెల్లి మండలాల ప్రజలు మంగళవారం భక్తిప్రపత్తులతో ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆయా గ్రామాలలోని హనుమాన్, రామాలయం, శివాలయాలలో హనుమంతుడికి విశేష పూజలు చేశారు. చేర్యాల పట్టణంలో విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో హనుమాన్ విగ్రహంతో రామాలయం నుంచి అభయాంజనేయ స్వామి ఆలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. కొమురవెల్లి మల్లన్న ఆలయ అనుబంధ హనుమాన్ ఆలయంలో హనుమత్‌యజ్ఞం నిర్వహించగా, స్థానికులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.


చేర్యాల: హనుమాన్ దేవాలయంలో హనుమత్‌యజ్ఞం పూర్ణాహుతిలో పాల్గొన్న ఏఈవో బుద్ధి శ్రీనివాస్


కుకునూరుపల్లి: హనుమాన్ జయంతి సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న హిందూ సంఘాలు

● **హుస్నాబాద్ టౌన్:** హుస్నాబాద్ పట్టణంలోని పాటిమీద అంజనేయస్వామి దేవాలయంలో మంగళవారం హనుమాన్ జయంతి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా గణపతిపూజ, నవగ్రహపూజ, స్వామి వారికి అభిషేకం, హోమం, పూర్ణహుతి కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్థసారథి గీతా భక్త సమాజం వారిచే గీతా పారాయణం, ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో వాసవి పారాయణం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, కౌన్సిలర్ పెరుక భాగ్యరెడ్డి, ఆలయ కమిటీ ప్రతినిధులు నూకల కైలాసం, నీరుమల్ల శ్రీనివాస్ తదితరులున్నారు.

● **కుకునూరుపల్లి:** మంగళవారం హనుమాన్ జయంతి సందర్భంగా పలు గ్రామాలలో అంజనేయ స్వామి ఆలయంలో హిందూ సంఘాల ప్రతినిధులు పూజలు నిర్వహించి, ర్యాలీని నిర్వహించారు. కుకునూరుపల్లి మండల కేంద్రంలో దక్షిణ మధ్యరైల్వే ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 27 అడుగుల పంచముఖ హనుమాన్ విగ్రహాన్ని వేద పండితులు పూజా కార్యక్రమాలు నిర్వహించి ఆవిష్కరించారు.


హుస్నాబాద్ టౌన్: హనుమాన్ జయంతి సందర్భంగా హోమం నిర్వహిస్తున్న దృశ్యం

● **మద్దూరు:** మండలంలోని గ్రామాల్లో హనుమాన్ భక్తులు మంగళవారం హనుమాన్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయస్వామికి చందనం పూసి పూజలు చేశారు.

● **సిద్దిపేట అర్బన్:** సిద్దిపేటలోని విద్యానగర్ కాలనీలో గల ఇష్ట సిద్ధి బాలాంజనేయస్వామి ఆలయ అభివృద్ధికి బీఆర్ఎస్ నాయకుడు కల్వకుంట్ల వంశీధర్ రావు రూ.లక్ష ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీసభ్యులు పి.నరసింగరావు, సుదర్శన్ రెడ్డి, రామ్‌రెడ్డి, సత్యనారాయణరెడ్డి ఉన్నారు.


వెయ్యికి పైగా పదిపైసల బిళ్లలతో రూపొందించిన హనుమతుడి రూపం వద్ద రామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామరాజు
- గజ్వేల్

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య


కనకరాజ్ మృతదేహం

చేర్యాల, ఏప్రిల్ 23: ఆర్థిక ఇబ్బందులకు తోడు కుటుంబ కలహాలు తాళలేక ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన చేర్యాల మండలం వీరన్నపేటలో మంగళవారం చోటుచేసుకున్నది. గ్రామానికి చెందిన ముసిని కనకరాజ్(30) సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకున్నాడు. కాసేపటికి గమనించిన భార్య చుట్టుపక్కలవారిని పిలిచి కిందకి దించేసరికి మృతిచెందాడు. సమాచారం అందుకున్న ఎస్ఐ దామోదర్ ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

కొమురవెల్లి మల్లన్న ఆలయ
వార్షిక ఆదాయ, వ్యయ వివరాల వెల్లడి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చేర్యాల, ఏప్రిల్ 23: కొమురవెల్లి మల్లికార్జునస్వామి దేవాలయ 2023-24ఆర్థిక సంవత్సర వార్షిక ఆదాయ, వ్యయాల వివరాలను ఎట్టకేలకు ఆలయాధికారులు వెల్లడించారు. ఆర్థిక సంవత్సరం ముగిసి మూడువారాలు గడిచినా ఆలయ ఆదాయ, వ్యయ వివరాలను వెల్లడించని విషయమై మంగళవారం 'ఆంధ్రజ్యోతిలో' ప్రచురితమైన కథనానికి ఆలయాధికారులు స్పందించారు. ఈవిషయమై ఆలయ ఈవో బాలాజీశర్మ మంగళవారం ఒక ప్రకటనలో వివరాలు వెల్లడించారు. మొత్తంగా ఆలయ ఆదాయం సుమారు రూ.46.34కోట్ల టర్నోవర్‌కు చేరుకుంది. నికర ఆదాయం రూ.18,74,65,477సమకూరినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా అడ్జస్టమెంట్స్ కింద రూ.13.86కోట్లు, పెట్టుబడులలో రూ.13.15కోట్లు, ఫారం-3 ప్రకారం రూ.18.01కోట్ల వివరాల నమోదుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

రాయితీకి.. రాం రాం..!

● **ఆరేళ్లుగా సబ్సిడీ పై రైతులకు అందని టార్పాలిన్ కవర్లు**

● **బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నవైనం**

చిన్నకోడూరు, ఏప్రిల్ 23: గతంలో అకాల వర్షాల నుంచి రైతులు పండించిన పంటను కాపాడుకోవడానికి రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై టార్పాలిన్ కవర్లు అందించేది. కానీ సుమారు ఆరేళ్లుగా ప్రభుత్వం టార్పాలిన్ కవర్లపై సబ్సిడీని నిలిపివేసింది. దీంతో వర్షాలు కురిసినప్పుడు చేతికి అందివచ్చిన పంటను నష్టపోవాల్సి వస్తున్నదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో ప్రైయివేట్ వ్యక్తుల నుంచి టార్పాలిన్ కవర్లను పూర్తి ధర చెల్లించి కొనుగోలు చేయాల్సి వస్తున్నదని రైతులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పంటల ఉత్పత్తులను కాపాడుకోవడానికి సబ్సిడీపై టార్పాలిన్ కవర్లు అందించాలని ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.

మతోన్మాద బీజేపీని ఓడించండి

● **నియోజకవర్గ జేఏసీ కన్వీనర్ కవ్వా లక్ష్మారెడ్డి**


రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కోహెడ, ఏప్రిల్ 23: ఈ పార్లమెంటు ఎన్నికల్లో మతోన్మాద బీజేపీని ఓడించాలని నియోజకవర్గ జేఏసీ కన్వీనర్ కవ్వా లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో నియోజికవర్గ జేఏసీ ఆధ్వర్యంలో రాజ్యాంగ పరిరక్షణ చేతన్య ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బీజేపీ 10 సంవత్సరాలుగా మతవాద రాజకీయాలు నడిపిస్తున్నదని ఎండగట్టారు. కార్పొరేట్లకు అనుకూలంగా నల్ల చట్టాలు తెచ్చిన బీజేపీని ఈ ఎన్నికల్లో ఓడించాలన్నారు. కార్యక్రమంలో మేకల వీరన్న యాదవ్, ద్యాగల. సారయ్య, ఎదులాపురం తిరుపతి, చెప్యాల ప్రకాష్, మంద ధర్మయ్య, దొమ్మాట జగన్‌రెడ్డి, గొరిటాల లక్ష్మణ్, వెన్న రాజు, బాలకిషన్, రాజమౌళి, శంకర్, నరసయ్య మల్లేశం ఉన్నారు.

'బీఆర్ఎస్ భువనగిరి అభ్యర్థి గెలుపు తథ్యం'

చేర్యాల, ఏప్రిల్ 23 : భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపు తథ్యమని బీఆర్ఎస్ కొమురవెల్లి మండల నాయకుడు ఏర్పుల మహేశ్ అన్నారు. కొమురవెల్లి మండలకేంద్రంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారుడిగా, నిస్వార్థపరుడైన క్యామ మల్లేశ్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు సుపరిచితుడని, అన్నివర్గాలవారితో సత్సంబంధాలున్నాయన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పొరపాటు చేశామని ప్రజలు భావిస్తున్నారని, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై సంపూర్ణవిశ్వాసంతో క్యామ మల్లేశంకు పట్టంకట్టేందుకు సంసిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

ఉన్నత విద్యార్థులతోనే దేశ భవిష్యత్తు

● **రోటరీ ఎలెక్టెడ్ గవర్నర్ ఉదయ్ పిలాని**

● **ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు 350 సైకిల్ల పంపిణీ**

ములుగు, ఏప్రిల్ 23: ఉన్నతమైన విద్యార్థులతోనే దేశానికి మంచి భవిష్యత్తు ఉంటుందని ఆర్ఐ డిస్ట్రిక్ట్ - 3150 ఎలెక్టెడ్ గవర్నర్ ఉదయ్ పిలాని అన్నారు. మంగళవారం ములుగు మండలం లక్ష్మక్కపల్లిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బొమ్మిడాల భానుమూర్తి ట్రస్టు సహకారంతో, రోటరీక్లబ్ ఆఫ్ గజ్వేల్ ఆధ్వర్యంలో 350 సైకిల్లను ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీడీజీ రమేశ్‌వంగాల, డీజీఎన్ రామ్‌ప్రసాద్, నాయకులు రంజిత్ సింగ్, శ్రేయోభిలాషులు ఆర్గనైజర్ విష్ణు జగతి, క్లబ్ అధ్యక్షుడు బాబుగౌడ్, కార్యదర్శి నరసింహారెడ్డి, మండల విద్యాధికారి సునిత, క్లబ్ చైర్మెన్‌లు చంటి, కరుణాకర్‌రెడ్డి, పూర్వ అధ్యక్షులు పురుషోత్తం, నరసింహారెడ్డి, జగదీశ్వర్, బాపురెడ్డి, క్లబ్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ అంజిరెడ్డి, నరేశ్‌గౌడ్, సాయిరెడ్డి, రోటరీక్లబ్ ఆఫ్ గజ్వేల్ సభ్యులు ఎస్. కరుణాకర్‌రెడ్డి, సంతోష్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, మహేశ్, రవీందర్ రెడ్డి, నరేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, జైపాల్ రెడ్డి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

మెదక్ గడ్డపై కాంగ్రెస్ జెండాను ఎగురవేయాలి

కొల్చారం, ఏప్రిల్ 23: ఇందిరాగాంధి ప్రాతినిధ్యం వహించిన మెదక్ గడ్డపై కాంగ్రెస్ పార్టీ జెండాను ఎగురవేయాలని మెదక్ పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుముదిరాజ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు రెడ్డిపల్లి ఆంజనేయులు అన్నారు. కొల్చారం మండల పరిదిలోని పోతంశెట్‌పల్లిలో నూతనంగా ప్రతిష్టించిన పెద్దమ్మ తల్లిని మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కాంగ్రెస్ పాటు పడుతుందన్నారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహరెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్రీనివాస్‌గుప్తా, రవిందర్‌రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మల్లేశంగౌడ్, వెల్దుర్తి ఎంపీపీ స్వరూపానరేందర్‌రెడ్డి, వెల్దుర్తి మండలాధ్యక్షుడు మహేశ్వర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు గోవర్ధన్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, అప్పాజిపల్లి మాజీ సర్పంచ్ నాయిని సునీతావెంకట్‌గౌడ్, నాయకులు బండి రమేష్, అనిల్‌కుమార్, గొండ కృష్ణ, తాజా మాజీ సర్పంచ్‌లు నాగరాణినర్సింహులు, మన్నె శ్రీనివాస్, పోతంశెట్‌పల్లి ముదిరాజ్ సంఘం సభ్యులు గడ్డమీది రాములు, నర్సింహులు, దుర్గేష్, యాదగిరి, శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా రావణదహనం


రావణ దహనం

జోగిపేట, ఏప్రిల్ 23: పట్టణంలో కొనసాగుతున్న జోగినాథస్వామి ఉత్సవాల్లో చివరిదైన రావణ దహనం సోమవారం అర్ధరాత్రి నేత్రపర్వంగా జరిగింది. పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియంలో 40 అడుగుల ఎత్తులో పది తలలతో కూడిన రావణుడి భారీ ఆకారాన్ని రూపొందించి, దహనం చేశారు. కార్యక్రమంలో ఆలయ పూజారి భద్రయ్యస్వామి, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు డాకూరి శివశంకర్, సభ్యులు ఎస్.సురేందర్‌గౌడ్ పాల్గొన్నారు. జోగిపేట సీఐ అనిల్‌కుమార్ నేతృత్వంలో ఎస్ఐ అరుణ్‌గౌడ్, సిబ్బంది బందోబస్తును ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా సోమవారం సాయంత్రం ఒక్కసారిగా వీచిన గాలిదుమారానికి 40 అడుగుల రావణుడి ప్రతిమ కూలిపోయింది. ప్రతిమలో టపాసులు పెడుతున్న ఐదుగురు దానికింద పడి గాయాలపాలయ్యారు. నిర్వాహకులు వారిని ఏరియా ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స జరిపించారు. అనంతరం రావణుడి ప్రతిమను నిలబెట్టి యథాస్థితికి తీసుకువచ్చారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా అనిల్

హుస్నాబాద్, ఏప్రిల్ 23: బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా మండలంలోని నాగారం గ్రామానికి చెందిన ఇజ్జగిరి అనిల్‌ను నియమించారు. ఈ విషయాన్ని ఆ సంఘం జాతీయ నాయకులు గొర్ల అయిలేష్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ సామాజిక, రాజకీయ చైతన్యం కోసం, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అనిల్ తెలిపారు.

భువనగిరి సభను విజయవంతం చేయాలి

మద్దూరు, ఏప్రిల్ 23: ఈ నెల 25న మాజీ సీఎం కేసీఆర్ సారథ్యంలో భువ నగిరిలో నిర్వహించే రోడ్‌షోను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోష్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం సంతోష్ మాట్లాడారు. గ్రామాల నుంచి భారీగా అభిమానులు, కార్యకర్తలు నాయకులు తరలి వచ్చి రోడ్‌షోను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు మండల నాయకులు పాల్గొన్నారు.

బెల్టుషాపులపై దాడులు

చేర్యాల, ఏప్రిల్ 23: కొండపోచమ్మ దేవాలయ సమీపంలోని చేర్యాల మండలం నాగపురి శివారులో అక్రమంగా నిర్వహిస్తున్న పలు బెల్ట్‌షాపులపై సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, కొమురవెల్లి పోలీసులు మంగళవారం దాడులు చేశారు. ఈ సందర్భంగా జక్కన్నగారి పల్లవి హోటల్‌లో 13లీటర్ల బీరు బాటిళ్లు, తాటిపాముల స్వప్న హోటల్‌లో 6.950లీటర్ల బీర్లు, విస్కీని స్వాధీనం చేసుకున్నారు. ఇళ్లు, హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, కిరాణా, ఇతర దుకాణాలలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు తప్పవన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో వార్షికోత్సవాలు

మునిపల్లి, ఏప్రిల్ 24: మండల పరిధిలోని పెద్దచెల్మెడ అంగన్‌వాడీ కేంద్రాల్లో మంగళవారం వార్షికోత్సవాలు అంగన్‌వాడీ టీచర్లు రేణుక, లక్ష్మి, లక్ష్మి, శాంతమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు క్రిష్ణ ఆధ్వర్యంలో 5 సంవత్సరాలు నిండిన పిల్లలకు అసైన్‌మెంట్ కార్డులు అందజేశారు. చిన్నతనం నుంచే పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించే బాధ్యత అంగన్‌వాడీ కేంద్రాలు, టీచర్లదేనని ఆయన చెప్పారు.

మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానం

చేర్యాల, ఏప్రిల్ 23: కొమురవెల్లి మండలం గురువన్నపేటలో గౌడసంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న రేణుకా ఎల్లమ్మ కల్యాణానికి హాజరు కావాలని కోరుతూ, నిర్వహకులు మంగళవారం రాష్ట్ర బీసీ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆహ్వానపత్రిక అందించారు. అనంతం జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ నాగపురి రాజలింగం తదితరులకు ఆహ్వానపత్రికలను అందజేశారు.

పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం

మర్కుక్, ఏప్రిల్ 23: పాఠశాలల చివరి రోజు కావడంతో రాష్ట్ర ప్రభుత్వం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించి విద్యార్థులకు ప్రోగ్రెస్‌కార్డులు ఇవ్వాలని సూచించింది. అందులో భాగంగా మర్కుక్‌లోని అంగడికిష్టాపూర్ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఓంకార్ రాధాకృష్ణ అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అథితులుగా రాష్ట్ర కమ్యూనిటీ మొబలైజేషన్ ఆఫీసర్ జోసెఫ్, రాష్ట్ర పరిశీలకులుగా హాజరై విద్యార్థులను, తల్లిదండ్రులనుద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాల ఇంత అద్భుతంగా ఉండడం నేనెప్పుడూ చూడలేదని, కార్పోరేట్ హంగులతో పాఠశాలను నడుపుతున్న ప్రధానోపాధ్యాయుడు ఓంకార్ రాధాకృష్ణ. ఉపాధ్యాయులను తల్లిదండ్రులని అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ మాజీ చైర్మనులు బాల్‌రెడ్డి, కుమ్మరి కనకయ్య, ఉపాధ్యాయులు రామకృష్ణారెడ్డి, హారిక, చిన్న కృష్ణ, నవీన, హసీనా, ప్రవళిక, కనకలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన


నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

హుస్నాబాద్‌రూరల్, ఏప్రిల్ 23: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతున్నదని పోతారం(ఎస్) ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మనీల పేర్కొన్నారు. మంగళవారం హుస్నాబాద్ పట్టణంలోని కస్తూర్బా కాలనీలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన వారే అన్నిరంగాల్లో నేడు రాణిస్తున్నారన్నారు. క్రమశిక్షణ, ఆటపాటలతో, ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ధనలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన వార్షికోత్సవంలో ఉపాధ్యాయులు గోవర్ధన్, మోహన్‌రెడ్డి, అమ్మ ఆదర్శకమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లితండ్రులు పాల్గొన్నారు.

పాత గొనెసంచులతో రైతుల ఇబ్బంది

మిరుదొడ్డి, ఏప్రిల్ 23: రైతుల పట్ల నిర్లక్ష్యం వహించవద్దని తహసీల్దార్ గోవర్దన్ అన్నారు. మంగళవారం మండలంలోని ధర్మారం గ్రామంలోని ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడారు. ప్రభుత్వం పాత గొనెసంచులను ఇవ్వడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. ఆయన వెంట డిప్యూటీ తహసీల్దార్ వీరేష్, ఐకేపీ సిబ్బంది తదితరులున్నారు.

ప్రజాస్వామ్య రక్షణకు సీపీఎంను గెలిపించాలి

● **రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు చుక్క రాములు**


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు చుక్క రాములు

చేర్యాల, ఏప్రిల్ 23: పార్లమెంటులో ప్రజావాణి వినిపించాలన్నా, ప్రజాస్వామ్యాన్ని రక్షించలన్నా బీజేపీ కూటమిని ఓడించి సీపీఎంను గెలిపించాలని సీపీఎం రాష్ట్రకార్యదర్శి వర్గసభ్యులు చుక్క రాములు, ఎండీ అబ్బాస్ పిలుపునిచ్చారు. చేర్యాల పట్టణంలోని ఓ గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన జిల్లా సమావేశంలో వారు మాట్లాడారు. బీజేపీ వల్ల దేశంలో మతోన్మాదం, అవినీతి పెరిగిపోయిందన్నారు. సమావేశంలో పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి, రాష్ట్ర నాయకులు జగదీశ్, అడివయ్య నాయకులు కాముని గోపాలస్వామి, రాళ్లబండి శశిధరర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, భాస్కర్, ఎల్లయ్య వెంకట్‌మావో, బండకింది అరుణ్ పాల్గొన్నారు.

సీపీఎం అభ్యర్థిని గెలిపించాలి

మద్దూరు, ఏప్రిల్ 23: సీపీఎం అభ్యర్థి ఎండీ జహంగీర్‌ను గెలిపించి పార్లమెంట్‌కు పంపాలని జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రాళ్లబండి శశిధర్ కోరారు. మంగళవారం మండలంలోని సలాఖ్‌పూర్, మర్మాముల గ్రామాల్లో సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శశిధర్ మాట్లాడారు. ఎంపీ అభ్యర్థికి ఓటేసి మతోన్మాద రాజకీయవాదులను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి ఆలేటి యాదగిరి, జిల్లా కమిటీ సభ్యులు చొప్పరి రవికుమార్, ఎండీ షఫీ, గూడ బాల్‌రెడ్డి, కనకయ్య, మల్లయ్య శంకర్, రాజయ్య. బిక్షపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

కుకునూరుపల్లి, ఏప్రిల్ 23: మండలానికి చెందిన నాయకులు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కొనాయిపల్లి గ్రామ మాజీ సర్పంచ్ భర్త మిట్టపల్లి రుషి, మాజీ ఉపసర్పంచ్ పిట్ల రమేశ్, కుకునూరుపల్లి మాజీ ఉపసర్పంచ్ బాలయ్య తదితరులు పార్టీలో చేరారు. మండలానికి చెందిన మరికొంతమంది నాయకులు కాంగ్రెస్‌లో చేరాల్సి ఉండగా, అనుకోని పరిస్థితుల్లో వారు అక్కడి నుంచి వెనుదిరిగారని విశ్వసనీయ సమాచారం.


రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన కుకునూరుపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు

పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 23: సిద్దిపేట అర్బన్ మండలం నాంచార్‌పల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేశారు. అలాగే ఎక్స్‌లెన్సీ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మావతి మాట్లాడుతూ.. విద్యార్థులు సెలవుల్లో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతిరోజు ఇంటి వద్ద విద్యా ప్రణాళికలో భాగంగా రాయడం, చదవడం నేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సీహెచ్.రవి, మల్లికార్జునరెడ్డి స్రవంతి, దేవరాజు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడిగా బాల్‌రెడ్డి

గజ్వేల్/వర్గల్, ఏప్రిల్ 23: వర్గల్ మండల బీజేపీ అధ్యక్షుడిగా వర్గల్‌కు చెందిన టేకులపల్లి బాల్‌రెడ్డిని నియమిస్తూ, బీజేపీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి ఉత్తర్వులను విడుదల చేశారు. ఈ సందర్భంగా బాల్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పార్టీ మండల బాధ్యతలను అప్పగించిన జిల్లా అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

బిక్షాటన విషయంలో ఘర్షణ

● **ఒకరికి గాయాలు - నలుగురిపై కేసు**

చేర్యాల, ఏప్రిల్ 23: బిక్షాటన విషయంలో దాడి చోటుచేసుకున్న సంఘటనలో చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన దామనమైన శ్రీనుకు తీవ్రగాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలిలా ప్రకారం.. వీరన్నపేటలో గ్రామదేవతల పండుగ జరుగుతున్నది. ఈ క్రమంలో మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన దామనమైన శ్రీను తదితరులు గ్రామస్థుల ఇళ్లలో యాచించుకుంటున్నారు. ఇదేక్రమంలో యాచన కోసం జనగామ ప్రాంతానికి చెందిన ఎల్లయ్య, దుర్గయ్య, భాషా, రాజు తదితరులు గ్రామానికి వచ్చారు. తమకు హక్కు కలిగిన గ్రామంలో యాచించకూడదన్న ఒప్పందం ఉల్లంఘించడం తగదని శ్రీను పేర్కొనడంతో నలుగురు వాగ్వాదానికి దిగి ఘర్షణపడ్డారు. దీంతో శ్రీనును కర్రతో కొట్టడంతో తలకు గాయాలయ్యాయి. చేర్యాల పోలీసులు సమాచారం అందుకుని గ్రామానికి చేరుకున్నారు. చికిత్స నిమిత్తం శ్రీనును ఆస్పత్రికి తరలించారు. బాధితుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసునమోదు చేసినట్లు ఎస్ఐ దామోదర్ తెలిపారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

● **మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు**

చిన్నకోడూరు, ఏప్రిల్ 23: రేణుకా ఎల్లమ్మ దయతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆకాంక్షించారు. మంగళవారం చిన్నకోడూరు మండల కేంద్రంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రేణుకా ఎల్లమ్మ కల్యాణలో పాల్గొన్నారు. అనంతరం విఠలాపూర్ గ్రామంలో జరుగుతున్న ఎల్లమ్మ ఆలయ ఉత్సావాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు శ్రీనివాస్, వైస్ ఎంపీపీ పాపయ్య, పీఏసీఎస్ చైర్మన్ కనకరాజు, ఆయా గ్రామాల ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, గౌడ సంఘం సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **నారాయణరావుపేట:** బీరప్ప దయ, దీవెనలతో ప్రజలందరికీ మంచి జరగాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో బీరప్ప ఉత్సవాల్లో, జక్కాపూర్ పెద్దమ్మ ఆలయ ఉత్సవాల్లో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఓగ్గు బాలకృష్ణ, ఎంపీటీసీలు సంతోష్‌కుమార్, భానుచందర్, మండల మహిళా నాయకురాలు పద్మ, నాయకులు కిషన్, పరుశురాములు పాల్గొన్నారు.

● **నంగనూరు:** మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం ఆలయాల ప్రతిష్ఠ, వార్షికోత్సవాల్లో ఎమ్మెల్యే హరీష్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. నంగునూరు మండలం రాంపూర్ గ్రామంలో శ్రీసీతారామచంద్రస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే మండలంలోని గట్ల మల్యాల గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా ప్రతిష్ఠించిన శ్రీరేణుకా ఎల్లమ్మను దర్శించుకున్నారు. అంక్షాపూర్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రేణుక ఎల్లమ్మ దేవాలయ 4 వ వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన బోనల పండుగలో హరీశ్‌రావు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని జేపీ తండా గ్రామంలో శ్రీదుర్గమ్మ, శ్రీ వీరాంజనేయ స్వామి విగ్రహ నూతన ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.


నారాయణరావుపేట: బీరప్ప ఉత్సవాల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు


బెజ్జంకిలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా గుట్ట చుట్టూ బండ్లు తిప్పుతున్న భక్తులు

● **హుస్నాబాద్ టౌన్:** హుస్నాబాద్ పట్టణంలోని మరకత లింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, ఆలయ కమిటీ ప్రతినిధులు మర్యాల రాజిరెడ్డి తదితరులున్నారు.

● **రాయపోల్:** ఎల్లమ్మ ఉత్సవాలు రాయపోల్‌లో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు సోమవారం రాత్రి ఎస్సీ కాలనీ వాసులందరూ ప్రతి ఇంటికి రెండు బోనాలను తయారుచేసి పోచమ్మ ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకెళ్లారు. నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామంలో ఎలాంటి రోగాలు రాకుండా చూడాలని అమ్మవారిని మొక్కుకున్నారు.

● **చేర్యాల:** చేర్యాల మండలం నాగపురి గ్రామంలో బొడ్రాయి సహిత గంగాదేవి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు రెండవరోజైన మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆవాహిత మండపదేవతాపూజ, మూల మంత్ర జపాలు, జలాధివాస హవనం, వాస్తుపర్యగ్నీకరణం, చండీ హవనం, కుంకుమార్చన జరిపారు. చేర్యాల పట్టణ శివారు బండపల్లి కాలనీవాసులు నిర్మించుకున్న దుర్గమ్మ ఆలయం విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలకు ముస్తాబైంది. ఈసందర్భంగా నేటి నుంచి ఈ నెల 27వ తేదీ వరకు వేడుకలు నిర్వహించనుండటంతో నిర్వహకులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు.

● **బెజ్జంకి:** మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీ నృసింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘట్టాల్లో ఒకటైన శకటోత్సవ (బండ్లు తిరుగుట) వేడుకలను అంగరంగ వైభవంగా మంగళవారం జరిగాయి. శకటోత్సవ వేడుకల్లో మండలంలోని ఆయా గ్రామాల ప్రజలు ఎడ్ల బండ్లు, ట్రాక్టర్‌లు, కార్లు, ద్విచక్ర వాహనాలను గుట్ట చుట్టూ తిప్పి మొక్కులు చెల్లించుకున్నారు. శకటోత్సవ వేడుకల్లో మేకల బండి ప్రధాన ఆకర్షణగా నిలిచింది. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


రాయపోల్‌లో పోచమ్మ బోనాలు తీస్తున్న దృశ్యం